

# పరాజితుడు

కథానిక

లోకంలో ప్రత్యేకమైన వ్యక్తిత్వంగలవాళ్లు కొందరున్నారు. వీరికి స్వతహాగా ఏవిషయాన్నీ సావధానంగా ఆలోచించి - ఆచరించవలసిన విధానం నిర్ణయించుకునే వివేక జ్ఞానం తక్కువ. ఒక్కొక్కప్పు డసలు పూర్తిగా లోపిస్తుందేమోనని గూడా అనిపిస్తుంది; ఏ అజ్ఞాత శక్తులు నడిపిస్తూ వుండడంవల్లనో నడుస్తూ వుంటారు. వీరి జీవితంలో గొప్పతనానికిగాని-తక్కువతనానికిగాని నేపథ్యంలో వ్యక్తులు కారకులై వుంటారు. ఈ తత్వంగల వ్యక్తుల్ని వెనుక ఓ ఆధారమంటూ వుండి, బలీయమైన ప్రభావం ఎదుటి వ్యక్తిపైన ప్రసరింపజేసి నడిపిస్తూ వుండకపోతే జీవితంలో తప్పడడుగులు వేస్తూ వుండడం తథ్యం! ఇటువంటి మనః ప్రవృత్తిగల వ్యక్తుల్లో నరసింహశాస్త్రి ఒకడు.

బండికింకా చాలా టైముంది. టికెట్ కలెక్టరు బండి ఇవాళ లేటనిగూడా చెప్పాడు. స్టేషన్లోనే పచారుసాగించాడు శాస్త్రి. మనిషి ఎంత ప్రయత్నించినా ఓ నిర్ణయానికి రాలేక సతమతమవుతున్నాడు. ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోతోంది. జీవితంలో ప్రతి చిన్న విషయమూ ఓ సమస్య అయిపోయి కూర్చుంటే దుర్భరంగా తయారవుతుంది. కాకుండా ఎలా సాగుతుంది? ప్రతి నిమిషం-ప్రతి సెకనూ ఏదో సమస్య ఆ క్షణానికి మాత్రం విడదీయలేనంత చిక్కుగా కనిపిస్తూనే వుంటుంది. ప్రొద్దున్నే లేచింది మొదలు ఇవ్వాళ ఎలాగడుస్తుందా-అనేది ప్రథమ సమస్య! కాఫీకి డబ్బులేకపోతే సమస్య! మంచి సినిమాకి వెళదామంటే - లెక్చరరు క్లాసు వదలకుండా కాంపోజిషన్ రాస్తూ కూర్చుంటే - యెటువంటి హావభావాల్ని ముఖంలో చూపిస్తూ ఎప్రోచ్ అయితే లెక్చరరు వదిలిపెడతాడో అదో సమస్య. ఇంటికెళితే "కూరగాయలు పట్టుకురావడానికే వళ్లు అరిగిపోతుందిటురా?" అని అమ్మంటే తన తాహతుకు బజారు వెళ్ళి కూరగాయలు పట్టుకు రావాలా? అవసరంలేదా?—సమస్య! అన్నయ్య "ఇంటిపన్ను తగ్గించడానికి మునిసిపల్ ఆఫీసుకి పోయి అప్లికేషన్ రాసి పడేసిరారా" అంటే, "రెస్టు లేకుండా చంపేస్తున్నారు. ఎలా?" అని అదో సమస్య. తీరా మునిసిపల్ ఆఫీసుకి వెళితే-తనకు అప్లికేషన్ ఎలా రాసి ఎక్కడ దాఖలు చెయ్యాలో గూడా తెగ కష్టపడి చదువుతున్న బి. ఏ., చదువు నేర్పలేకపోయిందే అని అదో సమస్య! ఏమిటో, ఒకటి లేదనుకొంటే - ఇంకొకటి. ఈ సమస్యల గొడవంతా కేవలం మానవుడు రూపించుకోవడంవల్లనే కలుగుతుందేమో! అనుకొంటే అన్నీ సమస్యలే! కాని అనుకోకుండా వుండాలనేదే చిక్కు ప్రశ్న! ఎలా? ఎలా అనుకోకుండా వుండగలం?

టిక్కెట్టుకు కావలసిన డబ్బులు తీసి వేరుగా పాంటు జేబులో వేసుకొని మిగిలిన అర్థ రూపాయిలో బేడపెట్టి కాఫీత్రాగి మిగిలిన అరణాలు జాగ్రత్తగా దాచుకున్నాడు చొక్కాజేబులో. బండికోసం ఎదురుచూస్తూ నివరధిగా కలిగే

తిరునగర్

సందేహాలకు సమాధానాలు చెప్పుకుంటున్నాడు శాస్త్రి.

"బాబుగారూ! చెయ్యి చూస్తానండి! దివ్యమైన జాతకులు" అన్నాడు అఖండ ప్రజ్ఞానిధిలా ఏదో పెద్ద తను మనిషిముఖం చూచినంతమాత్రాన జాతకం చెప్పగలిగేట్టు, కాగితాలుపరచికూర్చున్న హస్తశాస్త్రజ్ఞుడు అటూఇటూ తిరుగుతూ, సమస్యల్ని ఓ పట్టాన తేల్చలేక గింజుకొంటున్న నరసింహశాస్త్రిని.

శాస్త్రి ఓ క్షణం సేపు తటపటాయించాడు. ఏమనుకున్నాడో. ఏమో చుట్టు ప్రక్కల పస్తాయించి చూచి జ్యోతిషుడి ముందు కూర్చుని చేయి అందించాడు. అతను దాన్ని ఎంతో పరీక్షగా పరిశీలిస్తున్నట్లు నటిస్తూ తనలో తను ఏవేవో సంజ్ఞలు చేసుకుంటున్నాడు.

"త్వరగా చెప్పవయ్యా! చంకక" ఆత్రంగా అన్నాడు శాస్త్రి. మనిషికి తనుగురించి-పరోక్షంగానైనా సరే ఏమనుకొంటున్నారో వినాలని వుంటుంది. అలాంటిది తన కెదురుగా, ప్రత్యక్షంగా తన భవిష్యత్తును ఉన్నదున్నట్లు చెప్పే మనిషి వున్నప్పుడు శాస్త్రి అంతగా వేగిరపాటు చూపించడంలో ఆశ్చర్యం లేదు.

"చెపుతా బాబుగారూ! ఇన్ని చేతులు చూచాను గదండీ! ఓహో! ప్రస్తుతం మీరు ఓ పెద్ద కార్యాన్నే తలపెట్టారు" అన్నాడు కార్తాంతిక శిరోమణి బాసినపట్టు వేసుక్కూర్చుని పూనకం వచ్చినట్లుగా ముందుకూ వెనకూ వూగుతూను!

"ఊ! అయితే!" త్వరగాచెప్పవయ్యా పుణ్యముంటుంది అన్నట్లుగా వుంది శాస్త్రి అడగడం.

"మీ హస్తరేఖను బట్టిచూస్తే సరిగ్గా ఈ సమయాన్నే మీకు అదృష్టం పట్టాల్సి వుంది. చూడండి రేఖ ఎంత స్పష్టపడిందో?" అన్నాడు వేళ్ళమీద ఏదో లెక్కించినమీదట. శాస్త్రి మనసులో ఏ లేశమాత్రమైనా సందేహం పీడిస్తూ వుండివుంటే ఈసారితో నివృత్తి అయిపోయింది.

"ఆఁ! ఆఁ! ఇంకా—"

"మీ కింతవరకూ కష్టకాలమే. ఇక సుఖపడే సమయం వచ్చింది. ఇకనించి మీ జీవితంలో అంతా అదృష్టమే. ఆహా! ఏమి రేఖండి" మళ్ళా ఒకసారి రేఖ గొప్పతనాన్ని స్థిరపరిచాడు జ్యోతిష్కుడు.

శాస్త్రి జేబులోనించి పావలా కాసు తీసి అతనికిచ్చి అక్కణ్ణించి బుకింగ్‌దగ్గరికి వెళ్ళిపోయాడు. దేవుణ్ణి నమ్మని పరమ నాస్తికులు సహితం కష్టకాలంలో మనసులోనైనా ఎవరికీ తెలియకుండా భగవంతుణ్ణి గుర్తుతెచ్చుకోకుండా వుండలేరు. 'నాస్తికత్వంలో' గొప్పతనం వుండవచ్చు; కాని మానవుడికి నాస్తికత్వంవల్ల వచ్చే ప్రయోజనం తక్కువ. ఆస్తికత్వంవల్ల తను చేసిన పాపాల్నన్నిటినీ ఒక ఆరాధ్యదేవతమీద పడేసి మనస్సును నిశ్చితంగా చేసుకొని తేలికపడతాడు. అది ప్రకృతి మానవుడి కిచ్చిన సౌకర్యం! ఆ సౌకర్యాన్ని నిరాకరించినందువల్ల ప్రకృతికి ఆట్టే నష్టంలేదు. కాని మనకొచ్చే లాభంకూడా లేదు. శాస్త్రి ఇటువంటివన్నీ మూఢనమ్మకాలని ఖండించినా ఏ అతీతమైన శక్తికో లొంగిపోయి చెయ్యి పొట్టకూటికోసంకూర్చున్న జ్యోతిష్కుడి చేతి కిచ్చేశాడు. మానవుడి నైజాన్ని నిర్ణయించేది పరిస్థితులు; భావాలు, చాంచల్యాలు.

టిక్కెట్టు తీసుకొని ప్లాట్‌ఫారంమీది కొచ్చాడు శాస్త్రి. తను చేస్తున్నపని సమంజసమేనా? తను పొరపాటు పడ్డాడేమో? అది తేలడానికి అనుభవం కావాలి. కాని అనుభవానికి హద్దులు ఎక్కడ? జీవితపు అంతమే అనుభవానికి హద్దా? కేవలం అనుభవాలకోసమే జీవితం అంకితం చెయ్యబడితే దాని పరమార్థం? తను తప్పటడుగు వేశానని తెలిసేసరికే జీవితం పరిసమాప్త మవుతుంది. అప్పుడు ఆ సత్యశోధన వల్ల ఫలితం లేదు.

రాజ్యలక్ష్మి ప్రేమను తను శంకించలేదు. ఆమెను అనుమానించడం తన కలలో గూడా సంభవం కానిది. అసలు ప్రేమకు తాత్కాలిక విలువను అంటుగట్టడం శాస్త్రికి గిట్టదు. అతనెప్పుడూ ప్రేమకు స్థిరమైన విలువని ఇచ్చి పవిత్రంగా చూస్తాడు. కనుక రాజ్యలక్ష్మిని తను ఏవిధంగానూ శంకించలేదు.

దూరంగా రైలుపొగ కనిపిస్తోంది. సిగ్నల్ గూడా ఇచ్చారు. రైలింజను దృష్టిపథంలో

పడింది. శాస్త్రికి తనకేసే నిప్పులు కక్కుకొంటూ రైలు వస్తూ వింతగా కనిపించింది.

రైలుస్టేషన్‌లో ఆగేసరికి అతనిలో ఇదివరకు లేని ఆలోచన కొత్తగా ఇంకొకటి బయలుదేరింది; తను తొందరపడుతున్నాడేమో? వెంటనే సమాధానంగూడా వచ్చేసింది. అంతకంటె ఏం చేయాలి? చిన్నతనంనించి పెంచిన అన్నయ్యే చేసిందేమిటి? ఒకదరివరకూ తెచ్చి తనకేమీ సంబంధంలేనట్టు వూరుకున్నాడు. తను అన్నయ్య చెప్పినదానిగ్గూడా ఒప్పుకున్నాడు. కాని అన్నయ్య హాళ్ళకిహాళ్ళ-సున్నాకుసున్నా లెక్క తేల్చి చూపించాడు. తనకేమీ మిగల్దని తెలిసింది తరువాత.

చెల్లికోసం తన జీవితం నాశనం చెసుకోవాలి; ఇంటిదగ్గర జరిగిన సంఘటనలన్నీ గుర్తుకు రాసాగేయి ఒకటితరువాత ఒకటి.

“ ‘లా’ చదవడానికి మనదగ్గర డబ్బేదీ?” అన్నాడు వెంకటరమణ అన్నయ్య.

“ఎలాగూ స్కాలర్‌షిప్పుందిగా? ఎంతో ఖర్చుకాదు గూడా...నా విషయం నీకూ తెలుసుగా అన్నయ్యా!”అన్నాడు తను.

“అయినా ఈ డిగ్రీతో ఆపేస్తే ఏం?” అని తన సంశయం తెలియపరచాడు అన్నయ్య.

ఇది తన ఆశయానికే విరుద్ధం! బి. ఏ.,వరకూ చదివింతరువాత ఎంతకాలంనించో అనుకుంటున్న ఆ ‘లా’ గూడా చదవకపోతే తన బి. ఏ., డిగ్రీ ఎందుకు?

“బి. ఏ., డిగ్రీ పుచ్చుకొని ఉద్యోగాలకోసం కుక్కల్లా తిరిగేవాళ్ళని నువ్వు చూస్తూ వున్నావుగా అన్నయ్యా!” అన్నాడు శాస్త్రి ఎటో చూస్తూను.

వెంకటరమణ అన్నయ్య కొంచెంసేపు ఆలోచించి—

“మరి మావయ్య కూతుర్ని చేసుకుంటావా?” అన్నాడు. అంటే తనదగ్గర డబ్బేమీ లేదనీ- ఆ వివాహంవల్ల వచ్చే డబ్బుతో చదివిస్తానని చెప్పడమేగా!

తను “ఊఁ, సరే!” అందామనుకుంటున్నాడు ఇంతలో అన్నయ్య మళ్ళీ అన్నాడు—

“అలా చేస్తే చెల్లి పెళ్ళిగూడా అయిపోతుంది. ఏదో మావయ్య అయిదువేలిస్తానంటున్నాడు గదా! రాధకీ కట్నం ఇవ్వకపోతే మంచివాళ్ళెలా వస్తారు? ముందు రాధ పెళ్ళయిపోతే నీ పెళ్ళితో పాటు, మిగిలిన డబ్బుకు ఇంకా అప్పోసప్పో చేసైనా నువ్వు చదవవచ్చు. అన్నివిధాలా ఉపయోగపడుతుంది.”

తనకేం మిగులుతుంది? చెల్లెకి కట్నం-రెండు పెళ్ళిళ్ళకు ఖర్చు-సరిపోతుంది. అప్పోసప్పోచేస్తాడట. తనకేముందని ఇస్తారు అప్పు?...

అది తరువాత సంగతి. అసలు మావయ్య కూతురు సత్యవతిని ఎలా చేసుకోవడం? చిన్నతనంనించీ కలిసి పెరిగితే ప్రేమ కలుగుతుందంటారుగాని తనూ-సత్యవతీ చిన్నతనంనించీ ఒక్కచోట పెరిగారు. గాని తనకా అమ్మాయిమీద ఎప్పుడూ పెళ్ళిచేసుకోవాలని కోరిక కలగలేదు. తనకే కొశానా ఇష్టంలేదు సత్యవతిని పెళ్ళి చేసుకోవడం. డబ్బుకోసం ఈనాడు సత్యవతిని చేసుకుంటే జీవితాంతంవరకూ అసంతృప్తిగా గడపాల్సిందేగా! ఎలా?

మరి తన జీవితాన్ని గురించే అస్తమానం ఆలోచిస్తే “చెల్లి” జీవితమో?

కట్నం లేకపోతే మంచివరుడెవ్వడూ రాడు. మావయ్య గనక తనకు అయిదువేలిస్తానంటున్నాడు! ఆడపిల్ల పెళ్ళిచెయ్యాలంటే మాటలా? వరకట్నం-పెళ్ళి ఖర్చులూ కలిపితే సరిపోతుంది. అంత డబ్బు లేకపోతే, చెల్లి వివాహం జరగదు. అంటే ఆమెగూడా జీవితాంతం-కట్నంలేకుండా చేసిన భర్తతో అసంతృప్తిగా బ్రతకాల్సిందేగా!

“ఇదంతా ఎందుకు? అసలు మావయ్య కూతుర్ని చేసుకోవడంవల్ల తనకేవీ లాభం కలగడం లేదు.” ఒక నిర్దిష్టమైన “క్లూ”కి వచ్చెయ్యాలని ప్రయత్నించాడు. “చెల్లి కట్నం ఎంతిస్తాడు, తనకేం మిగులుస్తాడు అన్నయ్య?”

బండి కూతవేసింది. వివిధ మనఃప్రవృత్తులు చేస్తున్న యుద్ధంతోనే బండి ఎక్కాడు. బయలుదేరింది. కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాడు.

“అన్నయ్యచేసింది తప్పా?”

ఆయనమాత్రం ఏం చెయ్యగలడు? సంపాదించింది తనేమన్నా దాచుకొంటున్నాడా? అమ్మ

తమ్ముడు, ఇద్దరు చెల్లెళ్ళు, తనూ ఇంతమందిని పోషిస్తూ తనను బి. ఏ., వరకూ చదివించాడు కష్టనిష్ఠూరాలకు ఓర్చి. నాన్న పోయిందగ్గర్నుంచీ సంసారమంతా ఎలాగో ఈడుస్తూనే వున్నాడు తన చదువు ఆపకుండా.

శాస్త్రికి రాధ ముఖం గుర్తొచ్చింది. తను మావయ్య కూతుర్ని చేసుకోనని చెప్పినప్పుడు చెల్లి ముఖం వివర్ణమైపోవడం తను చూశాడు.

"ఏమిటి? తాను చేస్తున్నదంతా స్వార్థమేనా?" తన ఆలోచనలన్నిటికీ కాస్త దూరంగా వచ్చి చూచుకుని ప్రశ్నించుకున్నాడు శాస్త్రి. "అన్నయ్య సంపాదించి అంతా కుటుంబంకోసమే త్యాగంచెయ్యడంలా? తను వాళ్ళనించి ఏవీ సంబంధంలేనట్టు తప్పించుకొని వేరే తనమార్గం తను చూచుకుంటున్నాడు. మానవుడిలో ఇంత స్వార్థమైతే ఎలా?

తను అనుకున్నట్టుగా అన్నీ జరిగి-తనే వృద్ధిలోకి వస్తే కుటుంబాన్ని అలాగే వుంచుతాడా ఏమిటి? కాని అసలు రాజ్యలక్ష్మిదగ్గర డబ్బులేక పోతే?

అది పిచ్చి ప్రశ్న. లేకుండా వుండదు. ఆమె తలుచుకొంటే పుట్టించగలదు. యాభై ఎకరాల ఆసామీ అంతమాత్రం డబ్బు పుట్టించలేదూ?

ముందుకు తూలాడు, రైలు ఆగిపోయింది. తన కెదరవైపు తలుపు తీసుకొని కూలివాడు వచ్చి బెడ్డింగు ఎక్కించాడు. తరువాత పెట్టె. తరువాత ఎవరో ఓ మనిషి ఎక్కాడు. స్టేషన్ హడావుడిగా లేదు. ఎక్కిందా స్టేషన్‌లో ఒక్క ప్యాసెంజరు

పరధ్యాసంలో వున్న శాస్త్రికి "ఏరోయ్ నర్సూ"అనే పిలుపువినేసరికి పరాకు పారిపోయిం దెక్కడికో.

శాస్త్రి కొత్తవ్యక్తిని చూచి "ఓరి నువ్వట్రా రాముడూ? ఎప్పుడొచ్చావు? వైజాగ్ కేనా ప్రయాణం?"అన్నాడు.

"ఆఁఆ"అంటూ రామారావు శాస్త్రిదగ్గరగా వచ్చాడు సీటుకోసం

"ఇలా కూర్చో. ఎప్పుడొచ్చావు?"

"మా అన్నయ్య పెళ్లికి వచ్చాను. వచ్చి మూడురోజులయింది."

"ఓ! అలాచెప్పు, చదువు బాగా సాగుతోందా?

"మనచదువు నీకు తెలియదుగనకనా"అన్నాడు రామారావు చిన్నగా నవ్వుతూ.

రామారావు ఆనర్సు చదువుతున్నాడు. శాస్త్రి బి. ఏ.లో చేరాడు. రామారావువాళ్లు డబ్బుగలవాళ్ళు. ఆనర్సు చదివించడానికి ఇంటిదగ్గర ఎవరూ ఎదురుచెప్పలేదు. శాస్త్రి బి. ఏ., ప్యాసయినాడు. రామారావుది ఫైనలియరు. రామారావుకి నరసింహశాస్త్రికీ-రాజ్యలక్ష్మికీవున్న సంబంధం తెలియనిది కాదు. కాని దాన్నతనెప్పుడూ చులకన చెయ్య లేదు.

రాజ్యలక్ష్మితో మొదటి పరిచయం శాస్త్రి రాయలసీమ కరువుబాధితుల సహాయార్థం నాటకం నాటకం వేసినప్పుడు. భోజనాదివసతులన్నీ ఆ ఊరి మోతుబరి క్రొత్తగా చేతికి తాళాలువచ్చిన ఆధునికుడు నారాయణరావు ఇంట్లో. తను నాటకంలో హీరో వేసి ప్రేక్షకులకళ్ళవెంట నీళ్ళు తెప్పించాడు ఆ రాత్రి రాజ్యలక్ష్మి తననెంతో ప్రశంసించింది భర్త నారాయణరావుతోపాటు. రెండోరోజు తనకి ప్రత్యేకమైన ఏర్పాట్లు జరిగాయి భోజనం చేస్తూ వుండగా:

"రెండురోజులు ఇక్కడ వుండకూడదూ?" అంది రాజ్యలక్ష్మి.

"అవసరం కనిపించలేదు" అన్నాడు శాస్త్రి.

"నే నడుగుతున్నాగా?"

శాస్త్రి భోజనం చేస్తూ ఈ నూతనయువతి అభ్యర్థనతో అదిరిపడి తలెత్తిచూచాడు. అతని కా నిముషంలో రాజ్యలక్ష్మి ముఖంలో ఎటువంటి భావాలు కనిపించాయో వాటిని శాస్త్రి ఈనాటికీ మర్చిపోలేదు.

"అహా! వుండటానికి వీల్లేదండి. ఎల్లుండిమళ్ళా ఇంకో ప్రోగ్రాంవుంది. వెళ్ళాలి!" అన్నాడు చేయికడుక్కొడానికి విస్తరిముందునుంచిలేస్తూ.

"మీరేమీ అనుకోకుంటే ఒకటి అడగాలని వుంది మిమ్మల్ని" అంది ప్రయాణమౌతున్న శాస్త్రిని.

"అడగండి" అన్నాడు.

"మీ ఫొటో ఒకటి కావాలి" అంది.

శాస్త్రి ఆ మాటల్ని ఏవిధంగానైనా అర్థం చేసుకోనియ్యండి "వ్యవహారాన్ని అంతకుమించి పోనియ్యకండి. మీకు ఫోటో కావాలంటే నా అభ్యంతరం ఏమీలేదు" అన్నాడు నవ్వుతూ.

తరువాతపరిచయం స్టేషన్‌లో. అప్పుడప్పుడూ వాళ్ళవూరువచ్చి వెళుతూవున్నప్పుడు నారాయణ రావు స్నేహాన్ని పురస్కరించుకొని రాజ్యలక్ష్మితో కూడా పరిచయం కావలసివస్తూవుండేది. రాజ్యలక్ష్మి దగ్గర్నించి రెండుమూడు ఉత్తరాలుకూడా వచ్చాయి! గాని వాటికి తనేమీ జవాబివ్వలేదు.

కాని ఓ రోజు తను క్లాసులో వుండగా టెలిగ్రాం వచ్చింది బెజవాడనించి. రాజ్యలక్ష్మి ప్రాణాపాయస్థితిలో వుందనీ - తనని చూడాలంటూ వుందని. ఇది "అసంభవం" అనుకోడానికి శాస్త్రికేమి నిదర్శనలు దొరకలేదు. అతని హృదయం కరిగిపోయింది. తనకోసం ఓ జీవి అంతగా బాధపడుతున్నప్పుడు తను మొఖంచూపించేంత త్యాగం చెయ్యలేడూ? వెంటనే బయలుదేరాడు. కానీ రాజ్యలక్ష్మి స్టేషన్‌లో తనకోసం ఎదురు చూస్తూవుండడంచూసి ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి? ఏమిటిదంతా?" అన్నాడు.

రాజ్యలక్ష్మి చిన్నగా నవ్వుతూ "చెపుతాగా! నా వెంటరండి" అంది. సరాసరి హోటల్ రూమ్‌కి తీసికెళ్ళింది.

రాత్రిచాలా ప్రొద్దుపోయింతరువాత ప్రక్క గదిలో ఎవరో మగ్రాళ్లువచ్చి తెల్లవారేవరకూ ఏవేవో ఆడుతూనేవున్నారు. తెల్లవారుఝామున తలుపుతీసి బయటికివచ్చేసరికి రామారావు ప్రత్యక్షమయ్యాడు.

"ఏరోయ్ నర్సూ నువ్విక్కడ..."

"తరవాత చెపుతాగాని .ఎవరెవరున్నారు? ఎందుకొచ్చారు?"

"రాత్రి సినిమాచూడ్డానికి వచ్చాంలే! చాలా మందున్నారు. నువ్విక్కడున్నావేం?"

శాస్త్రి ఇంతవరకూ రూమ్‌మేటు రామారావు దగ్గర ఏ విషయాన్ని దాచలేదు. ఈ విషయం దాచడంవల్ల వచ్చే లాభంకంటె నష్టమేఎక్కువ. రామారావుకి చెప్పడంతో అది అంతటితోనేవుండి పోతుంది, చెప్పకపోతే రామారావుద్వారా అందరివల్లా గల్లంతు తప్పదు.

అంతావిన్నతరువాత.."ఓహో! లక్కీ ఫెలో" అన్నాడు....

ప్రస్తుతం ఎడతెగని చిక్కుసమస్యల్లో చిక్కుకున్న శాస్త్రికి రామారావుని చూడగానే కొంత శాంతి లభించిందనే చెప్పొచ్చు. చాలామందికి వాళ్ళమనసులోవున్న విషయాలన్నీ ఎదుటివ్యక్తికి చెప్పడంవల్ల హృదయం తేలికపడుతుంది. అది దౌర్బల్యం అయితే కావచ్చుగాని ఈ దౌర్బల్యంవల్ల ఒక్కొక్కసమయంలో మేలుజరగచ్చు! ఇంకో సమయంలో కీడూజరగవచ్చు!

శాస్త్రి రామారావువల్ల సలహా పొందుదామని నిశ్చయించుకున్నాడు. అందువల్లవచ్చే నష్టం కూడాలేదు.

"ఏమిటిరా నర్సూ విశేషాలు?" అన్నాడు సిగరెట్టు ముట్టించి రామారావు.

"విశేషాలేమున్నాయి. జీవిత శేషాన్ని గురించే ఆలోచిస్తూ ఇలా బయలుదేరాను."

"చదువయిపోయిందిగా ఏమన్నా ఉద్యోగం కోసమా?"

"అబ్బే లేదురా! 'లా' చదువు కామనివుంది"

"మరి చదవలేకపోయావా?..."

"డబ్బులేదురా!"

"అవును. పాపం మీ అన్నయ్య మాత్రం ఎక్కణ్ణించి తీసుకురాగలడు? పోనీ పెళ్ళిచేసుకోపోయావా? కట్నం కాస్తోకూస్తో వచ్చేది" మళ్ళీ ఇదే ప్రశ్న ఇక్కడా ఎదురైంది శాస్త్రికి.

"ఆఁ ఆ! అదేచూస్తూన్నాను" గొణిగాడు శాస్త్రి వినబడీ వినబడనట్టు.

"అసలింతకూ ఎంతవరకు బయలుదేరినట్లు?" అసలు ప్రశ్న సూటిగా వేశాడు రామారావు.

శాస్త్రి టికెట్టుతీసి చూపించాడు.

"ఓహో! ఇంకా ఆ సంబంధం పోలేదన్న మాట. సరే! కానీ" అన్నాడు నవ్వుతూ అదో విధంగా.

"ఈ సమయానికి రాజ్యలక్ష్మి నా జీవితానికి ఆధారంగా కనిపిస్తోందిరా!" అన్నాడు శాస్త్రి ఎదురువైపు కిటికీలోంచి పొలాలవైపు చూస్తూ.

"కొంపతీసి ప్రేమించావా ఏం?" అన్నాడు రామారావు ఆశ్చర్యంగా శాస్త్రివంక చూస్తూ.

"ఇంతకాలంనించీ కష్టపడి చదువు చెప్పిస్తున్న అన్నయ్య ఈ సమయానికి ముఖం అటు తిప్పుతున్నాడు. అటువంటప్పుడు ఏంచెయ్యను? రాజ్యలక్ష్మిని డబ్బుసహాయం చెయ్యమని అడగడానికి వెళుతున్నాను" అన్నాడు శాస్త్రి.

రామారావు రెండుక్షణాలు దీర్ఘంగా ఆలోచించాడు. "ఆమె ఇస్తుందని నమ్మకమేనా?"

"అది నానోటివెంట నే చెప్పకూడదు...నువ్వు ఆమె..." ఏదో ఏదో అనబోయాడు. రామారావు మధ్యలో బ్రేకువేసి, "ఇంతకూ మీ అన్నయ్య ఏమన్నాడు?" అన్నాడు.

"తానింకా ఒక్కక్లాసయినా చదివించలేనన్నాడు."

"అందుచేత పోట్లాడివచ్చావన్నమాట?"

శాస్త్రి సమాధానంగా ఏమీ మాట్లాడలేకపోయాడు.

"నీ 'లా' చదువుకి ఎంతవుతుందని సుమారు నీవుద్దేశం?"

"మూడు వేలుంటేచాలు ప్రస్తుతం"

"నువ్వు ఆమెదగ్గర అంతడబ్బు తీసుకోవడం నాకేమీ బాగాలేదు. రాజ్యలక్ష్మి వినోదంగా వేసిన ఉచ్చుతాళ్ళను నువ్వు బిగించుకొంటున్నావన్నమాట. ఉచ్చుతాళ్ళు బిగవకుండా వున్నంతకాలం బాగానేవుంటుంది. గాని అవి ఒకసారి బిగిస్తేమాత్రం సంకెళ్ళకంటె ఘాటుగా పని చేస్తాయి. స్త్రీని క్షమార్పణ వేడుకోవడం; దైన్యంగా అర్థించడమంత పొరపాటు ఇంకేమీ లేదని ఉద్దేశం! నాలెపురుగుగూట్లో ఈగ చిక్కుకున్న తరువాత చెయ్యగలిగిందేమీ వుండదు. ఇవన్నీ ఆలోచించు" అని మెదలకుండా వూరుకున్నాడు రామారావు. శాస్త్రి ఆలోచనలో పడ్డాడు. బండినడక సన్నగిలింది. స్టేషన్‌లో ఆగిపోయింది. మళ్ళా బయలుదేరడానికి కూత పెట్టింది.

"దిగవే?" అన్నాడు రామారావు సహజంగానే! శాస్త్రిదిగవలసిన స్టేషన్ దాటిపోవడానికి సిద్ధమౌతున్న ఇంజన్‌కూత విని. శాస్త్రి స్వాభావికంగా నే—

"నేను బెజవాడ వస్తున్నాను. ఇక్కడ దిగదలుచుకోలేదు. ఒకవేళ టి. సి. వస్తే దీనికి ఎక్సెస్ ఇవ్వొయ్యి" అంటూ టికెట్టు జేబులోంచి తీసి రామారావుకిచ్చి మళ్ళా ఆలోచనలో పడ్డాడు. రామారావు ఏదో గ్రహించి మాట్లాడకుండా వూరుకున్నాడు అటుచూస్తూ.

ఆ రాత్రికి రామారావు ప్రయాణం మానుకున్నాడు. శాస్త్రి, రావు ఆ రోజల్లా బెజవాడలో గడిపి రెండోరోజు రామారావు వాల్తేరు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. రెండోరోజు రామారావుని వాల్తేరుకు బండెక్కించి అతనిచ్చిన రూపాయలో తన వూరికి టికెట్టు కొనుక్కొని బండికోసం ఎదురుచూస్తున్న శాస్త్రికి "మూర్తీ" అనే కేకతో భూగోళమంతా గిర్రున తిరిగి ఒక్కసారి ఆగిపోయింది. తనని రాజ్యలక్ష్మి అలా పిలుస్తుంది. తిరిగి చూచేసరికి రాజ్యలక్ష్మి!

"ఇక్కడున్నావేం" అంది.

"ఆఁ! ఏదో పనివుండి" హీనస్వరంతో అన్నాడు.

"మా పెద్దమ్మ కూతురిపెళ్ళి ఇవాళే. ఇందాక బండికేవచ్చాం. మెడ్రాస్‌నించి ఓ స్నేహితురాలు వస్తుందని స్టేషన్‌కి వచ్చాను మాఇంటికి కెళదాం వస్తావా?"

"అబ్బె! అర్జెంటుగా వెళ్ళిపోవాలి..."

"ఆహా" అంది చిలిపిగా.

రామారావుదగ్గర శాస్త్రి ఏ బలహీనతకు లొంగిపోయాడో అదే బలహీనతకు రాజ్యలక్ష్మిదగ్గరా లొంగిపోయాడు...

"అలా వున్నావేం?" అంది రాజ్యలక్ష్మి.

"ఏమీలేదే! బాగానేవున్నాను" సమర్థించుకోబోయాడు. "మా బాబువికదూ! నాకు చెప్పకూడదా" అంది ముఖాన్ని హృదయానికి హత్తుకొంటూ తలలోకి వ్రేళ్లు పోనిచ్చి "అసలు నీదగ్గరికి బయలుదేరాను..." చెప్పలేక పోతున్నాడు.

"చెప్పు. నాతో చెప్పడానికేం?" అంది రాజ్యలక్ష్మి.

"లా, చదవడానికి అన్నయ్యదగ్గర డబ్బులేదన్నాడు" శాస్త్రి ఇంకేమీ చెప్పలేదు. రాజ్యలక్ష్మి ఇంకేమీ అడగలేదు.

"నాన్న బట్టలకోసం అయిదువందలిచ్చాడు. ప్రస్తుతం నా దగ్గరవున్నాయి. ఇవి తీసికెళ్ళి ముందు కాలేజీలో చేరు" అంటూ అయిదువందల

రూపాయలూ పదిరూపాయల నోట్లకట్ట ఇచ్చింది రాజ్యలక్ష్మి.

"నీకు డబ్బు పంపుతూవుంటాననుకో! కొంత కాలానికి మావారికి తెలిస్తే?" అంది శాస్త్రి కళ్ళల్లోకి చూస్తూ రాజ్యలక్ష్మి.

శాస్త్రి వెంటనే సమాధానం చెప్పలేకపోయాడు. రాజ్యలక్ష్మి మళ్ళా అంది.

"ఒక్కసారే ఇద్దామంటే నాదగ్గరడబ్బులేదు. ఒకవేళ నీకు పంపించడానికి డబ్బు కావాలన్నా వారికి తెలీకుండా ఎలా? ఎంత స్థితిమంతులరాలైనా భర్తచాటు బ్రతుకేగా?" అంది.

"తెలిస్తే ఏం? అప్పుడు నాదగ్గరికి వచ్చెయ్" అన్నాడు శాస్త్రి.

రాజ్యలక్ష్మి చిన్నగా నవ్వి "పిచ్చివాడా. ఏం చేసుకుంటావు నన్ను? ఆనందంకోసం చేసే పనులు వ్యక్తిగతంగా వుంటేనే బావుంటుంది. బహిర్గతమైతే అందులో ఆనందం వుండదు" అంది. శాస్త్రి ఏమిటో చెప్పడానికి గాబోలు నోరు విప్పబోయాడు. రాజ్యలక్ష్మి అందుకొని "అవన్నీ తరువాత ఆలోచించవచ్చునే! ముందు ఈ డబ్బుతో కాలేజీలో చేరు" అంది.

* * *

తను వెళ్ళింతరువాత ఎటువంటి తుఫాను చెలరేగివా వచ్చేప్పటికిమాత్రం ఇంట్లో వాతావరణం ప్రశాంతంగానే వుంది ఎవ్వరూ తనతో మాట్లాళ్ళేదు. సంధ్యవేళ రాధ "సెల్లుతోడాను. రా అన్నయ్యా" అంది ముఖాన చేయివేసుకుని పండుకొనివున్న శాస్త్రిని

శాస్త్రి లేచి తుండుకట్టుకొని నూతిదగ్గరికి వెళ్ళాడు రాధ దగ్గరేవుంది. ఇప్పుడు శాస్త్రికి రాధముఖం చూడడానికి భయంగావుంది. తానేదో రాధకు ద్రోహం చేస్తున్నట్లుగా బాధపడుతున్నాడు.

"అన్నయ్యా! ఎక్కడికెళ్ళావు ఈ రెండు రోజులూను?" అంది రాధ.

"మా స్నేహితుడికి సీరియస్‌గా వుందంటే బెజవాడ వెళ్ళాను" అన్నాడతో అటువేపు తిరిగి.

"చెప్పి వెళ్ళలేకపోయావా? అమ్మావాళ్ళూ ఖంగారుపడ్డారు" అంది రాధ మళ్ళీ.

శాస్త్రి సమాధానం చెప్పలేదు.

"నువ్వు సత్యవతిని చేసుకోనన్లేనా" అంది రాధ. శాస్త్రికి ఆ ప్రశ్నకు ముందున్న ప్రశ్నల సారాంశం సంక్షిప్తంగా తెలుసు. తానుచేస్తున్న పనికి సానుభూతి రాధ దగ్గర్నించి పొందాలని "ఏమో రాధా. చిన్నతనంనించి ఒక్కచోట పెరిగితే స్నేహం వృద్ధి పొందుతుందంటారు గాని ఎందుచేతనో నాకు సత్యవతిపేరు చెవితే ఆ భావమే పుట్టడంలేదు. ఎలా చేసుకోను?" అన్నాడు.

"అంతేనా...?" అంది ఆ కంఠస్వరం విని శాస్త్రి కంపించిపోయాడు. ఎంతో ఉద్వేగంగా వస్తున్న దుఃఖంలోంచి పెగుల్చుకుని వచ్చింది మాట

"రాధా?" అన్నాడు శాస్త్రి.

"ఆఁ" అంది రాధ.

"ఏడుస్తున్నావా?" నిజంగా తను అడగవలసిన ప్రశ్నగాదు. సమాధానంరాదని తనకీతెలుసు.

"నాకు తెలుసు రాధా నీ బాధ. కాని ఏం చేయ్యను జీవితమంతా విచారించవలసి వస్తుందేమోనని ఆలోచిస్తున్నాను" అన్నాడు.

"అందుకని కుటుంబాన్నంతటినీ నట్టేట్లో ముంచిపోదామనుకున్నావా? ఏదో వెతుకుతూ పెట్టి తీశాను. ఏవేవో కాగితాలు, ఉత్తరాలు దొరికాయి. నీవు నిజంచెప్పు...నువ్వెళ్ళింది ఎక్కడికి?...అన్నయ్యా! జీవితంలో చదువే ముఖ్యం గాదు. వాటికంటె ముఖ్యమైనవి చాలావున్నాయి. వాటికోసం చదువు.' సంఘంలో ఒక్క చదువే అవసర మనుకుంటున్నావు గాబోలు. వంశం-గౌరవం-ఇలాటి వింకా చాలావున్నాయి. వాటినన్నిటినీ అతిక్రమిస్తే సంఘచ్యుతుడివై పోవాల్సి వుంటుంది.

ఇవ్వాళ ఎవరో అమ్మాయి డబ్బుతో చదువు తావనుకో. తరువాతజీవితాన్ని కాస్త ఆలోచించు ఇంత డబ్బు సహాయం చేస్తూ ఉండంటే ఎవరికీ తెలియకుండా జరిగే పనికాదు. రేపు ఆ అమ్మాయి నీదగ్గరికి వచ్చేస్తే నువ్వు పరిగ్రహించ గలవా? ఇవన్నీ ముందు ఆలోచన లేకుండాచేసే పనులు. తరువాత వీటిని ప్రశ్నలకి సమాధానం చెప్పేటప్పటికి జీవితం సరిపుచ్చుకుటుంది"

శాస్త్రి స్తబ్ధుగా వింటూ నిలబడిపోయాడు.

"నేను నాకోసమే నిన్ను మావయ్య కూతుర్ని చేసుకోమని చెప్పడం లేదు. తరువాత ఎంతో వుంది పెద్దవ్వలసిన వాళ్లున్నారు. వాళ్ళకోసమైనా మావయ్య కూతుర్ని పెళ్ళి చేసుకుంటే మామ అల్లుడికి అవసరానికి ఆదుకోక పోడు. అన్నయ్యమీద నీకంత కోపమొచ్చింది. గాని పాపం ఆయనేం చేస్తాడు? సంపాదించినదంతా మనకే పెడుతున్నాడా ఇంకెవరికైనా యిస్తున్నాడా? తనేమైనా దాచుకొంటున్నాడేమో చెప్పు!" సమాధానం కోసం రెండు క్షణాలు ఆగింది రాధ. శాస్త్రి ఏమీ సమాధానం చెప్పలేదు. రాధ మళ్ళా అంది. "ఏమొచ్చినా మధ్యతరగతి వాళ్ళకే నన్నాయ్! అటుగొప్పవాళ్ళు కాలేరు. జీవితమంతా త్రిశంకు స్వర్గంలో పడి వుండాల్సిందే దాన్ని అతిక్రమిస్తే మాత్రం జీవితం లాటరీయే అవుతుంది. ఈ మధ్యతరగతి కుటుంబంలో ఏకాస్త పట్టుతప్పినా కాల ప్రవాహంలో పడి- సుడిగుండాల్లో చిక్కుపడిపోతారు. అందుచేత ఏ వొక్క వ్యక్తి స్వార్థం కోసం చూసుకున్నా కుటుంబం కూలిపోవడం తథ్యం-అంతే!" రాధ అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది.

రెండురోజుల తరువాత రాజ్యలక్ష్మి ఇన్స్యూర్ చేసిన అయిదువందలరూపాయల కవరు అందుకుని ఆశ్చర్యపడింది. అరోజే నరసింహశాస్త్రి పేరు ఎంప్లాయ్‌మెంటు ఎక్సేంజి ఆఫీసులో రిజిష్టరు చేయబడింది. ఆవేళే వెంకటరమణ అన్నయ్య మామయ్యకి ఉత్తరం రాశాడు—నర్సు సత్యవతిని చేసుకోడానికి ఒప్పుకున్నాడని.

---

ఆటవిక జాతులలో

# దొరల చట్టము

జి. సాంబశివరావు

హైద్రాబాదు రాష్ట్రములోని ఆటవిక జాతులలో "దొరల చట్టము" జాతొకటి. వీరిని కూడ యితరులు కోయలని, గోండులని పిలుతురు. కాని వీరు తమను కోయలని పిలిచిన కోపింతురు. హైద్రాబాదు ప్రభుత్వము ప్రచురించిన కరపత్రముతో వీరికి దుస్తుల, అద్దముల ఉపయోగము కూడా తెలియదని వ్రాసినారు. ఇది కేవలం అతిశయోక్తి. వీరిలో శాస్త్రోక్తముగా చదువువచ్చిన వారున్నారు, వ్యాపారము చేయువారున్నారు, రైతులవలె పుట్లకొలది ధాన్యమును పండించువారున్నారు.

ఈ జాతి వరంగలు జిల్లాలోని ఇల్లెందు, పాల్వంచ, ములుగు, బూర్గంపాడు తాలూకాలలో అధికసంఖ్యలో నున్నది. ఈ ప్రాంతమంతయు అరణ్యములతో నిండియున్నది. ప్రయాణ సౌకర్యములు తక్కువ

ఈ జాతివారు ఇతరులు భావించునంత ఆటవికులు కారు. వీరు మాట్లాడునది తెలుగుభాషయే. కాని చాల మోటుగనుండును. వీరు బట్టలు కట్టుకొందురు. ఇళ్ళలో నివసింతురు. ముఖ్యవృత్తి వ్యవసాయము, పశుపోషణ. వీరికి మంత్రతంత్రములు, చెట్లక్రియలు అంతగ తెలియవనే చెప్పవచ్చును.

వీరు మంచి వితరణ బుద్ధిగలవారు. తమకు పండిన దానిలో అంతోయింతో అడిగినవారికెల్ల పెట్టుదురు. వీరిలోని ఒకగొప్పగుణం స్వాతంత్ర్య ప్రియత్వము, ఇతరులవద్ద పనిచేయుట కిచ్చగించరు. ఇతరుల యిళ్ళలో పాచిపనిచేయుట నామర్దాగా భావింతురు. అందువలన సాధ్యమైనంతవరకు స్వతంత్ర జీవనముచేయ ప్రయత్నింతురు. వీరిలోని మరియొక గుణము తృప్తి. తమకున్న దానితో తృప్తిపడుదురు. ఇందులకు మరొక కారణము వీరి సోమరితనము. ఎక్కువ కష్టపడుట కిచ్చగించరు. వీరు ఆర్థికముగ హీనస్థితిలో యుండుటకు యిదికూడ ఒక కారణమే. అయినను కొలదిసంవత్సరములనుండి వీరిలోమార్పు కలుగుచున్నది.

వీరు తమ యిళ్ళను మనయిళ్ళవలెనే కట్టుదురు. కాని పూర్వము ఒకయింటికి మరొకయింటికి ఎంతో దూరముండెడివి. ఇప్పుడుకూడ